క్లుప్తంగా

జాబ్‌మేళాలో 32 మంది ఎంపిక

కంబాలచెరువు: ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 32 మంది వివిధ పోస్టులకు ఎంపికైనట్టు వైస్ ప్రిన్సిపాల్ జి.శరత్‌బాబు అన్నారు. తమ కళాశాల వివేకవర్ధిని సెమినార్ హాల్‌లో బుధవారం ఉదయం జరిగిన జాబ్‌మేళాలో హెచ్‌డీఎఫ్‌సీకి 11 మంది, ఎస్‌వీఎస్ బయో ఆర్గానిక్స్‌కి ఆరుగురు, ఎంసీవీ మోటార్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 11 మంది, ఎంటీ కెరియర్ సొల్యూషన్స్‌కు నలుగురు ఎంపికైనట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ అధికారులు డాక్టర్ పీవీబీ సంజీవరావు, ఎంఎస్ ఫణికుమార్, ఎం.లలిత రమ్య, డి.మధులత పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఆయా సంస్థల ప్రతినిధులు నియామకపత్రాలు అందజేశారు.

మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం



మద్దా మణిని సత్కరిస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దా మణిని బుధవారం కాతేరులోని ఆమె నివాసంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు కోరుకొండ చిరంజీవి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు తాళ్లూరి బాబూ రాజేంద్రప్రసాద్, దారా ఏసురత్నం, అర్థాల కుమార్‌బాబు, మద్దా రమేష్, నక్కా ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలుర హాస్టల్‌కు ఫ్యాన్ల వితరణ



హాస్టల్‌కు ఫ్యాన్లు అందజేస్తున్న నాయకులు

కంబాలచెరువు: నగరంలోని గాంధీపురం నంబర్-1 ఆనంద నిలయం (ఎస్సీ బాలుర వసతి గృహం)లో బాలుర సౌకర్యార్థం రెండు స్టాండింగ్ ఫ్యాన్లను దాతలు సమకూర్చారు. కొల్లి రాజన్‌బాబు, శాంతకుమారి మనవరాలు అవ్యక్త రాజన్ జన్మదినం సందర్భంగా దిపీఎంపీ సంఘ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ బళ్లా సత్యవతి వీటిని అందజేశారు. అలాగే దాడి విజయ్‌బాబు సాయంతో హాస్టల్‌కు 25 లీటర్ల ఫ్లోర్ పెయింట్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ నాయకులు కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబూ రాజేంద్రప్రసాద్, దారా ఏసురత్నం, అర్థాల కుమార్‌బాబు, బళ్లా మల్లేశ్వరరావు, వార్డెన్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో రూ.8 లక్షల టోకరా

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో రూ.8.50 లక్షల మోసపోయిన సంఘటనపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పేపర్‌మిల్ క్వార్టర్స్‌కు చెందిన కొడాలి వెంకటేశ్వరరావు టెలిగ్రామ్‌లో ఆన్‌లైన్ ట్రేడింగ్ చేశాడు. ఈ క్రమంలో అవతలి నుంచి టెలిగ్రాంకు వచ్చిన లింక్‌కు పలుమార్లు నగదు వేశాడు. తర్వాత అతడి బ్యాంకు ఖాతాలో రూ.8 లక్షలు మాయమయ్యాయి. ఈ మేరకు వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆమోదం తప్పనిసరి

పెదపూడి: గ్రామాల్లో ఆక్వా సాగు చేపట్టడానికి గ్రామ సభల ఆమోదం తప్పనిసరిగా ఉండాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పైన, పుట్టకొండ, వేంద్ర, పెద్దాడ గ్రామాల్లో ఆక్వాసాగు అనుమతులపై గ్రామ సభలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ఎవరైనా ఆక్వాసాగు చేపట్టాలంటే మొదటగా ఆ భూమి ఆక్వా జోన్‌లో ఉండాలన్నారు.

సినిమాలు



శ్యామల	:	గుడ్ బ్యాడ్ అగ్లీ
సూర్యమినీ	:	అవుట్ సికిందర్
సూర్యప్యాలెస్	:	జాక్
స్వామి	:	కోర్ట్
శివజ్యోతి	:	గుడ్ బ్యాడ్ అగ్లీ
అనుశ్రీ	:	జాక్
రాజా	:	రాబిన్‌హుడ్
ఊర్వశి	:	ఎల్2ఎంపురాన్
మేనక	:	28సి
రంభ	:	రాబిన్‌హుడ్
కుమారి	:	ఆర్య-2
అప్సర	:	మ్యాడ్ స్క్వేర్
అశోక	:	జాక్
నామవరం		
వీఎస్ మహల్	:	జాక్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	మ్యాడ్‌స్క్వేర్
కడియం		
వెంకటసూర్య	:	జాక్

ఇక నో వర్రీ

- ఈ-శ్రమ్‌లో డెలివరీ బాయ్స్ నమోదు
- అసంఘటిత కార్మికులుగా గుర్తింపు
- 17వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్
- ప్లాట్‌ఫామ్ వర్కర్ల హర్షం



నమోదు పత్రాలు అందిస్తున్న సహాయ కార్మిక కమిషనర్

సీటీఆర్ఐ: అర దశాబ్దం క్రితం ఏ సరకు కావాలన్నా దగ్గర్లోని కిరాణా స్టోర్స్‌కి వెళ్లి తెచ్చుకునేవారు. అలాగే అల్పాహారానికి రెస్టారెంట్లకు, గృహోపకరణాలకు ఆయా షాపులకు వెళ్లడం సర్వసాధారణం. కార్పొరేట్ సంస్థల ప్రవేశం తర్వాత మొత్తం ముఖచిత్రం మారిపోయింది. ప్రస్తుతం ఏది కావాలన్నా క్షణాల వ్యవధిలో ముందు వాలిపోతోంది. అంతే కాదు.. ఎక్కడికి వెళ్లాలన్నా బైక్, ఆటో, కార్లు.. కోరుకున్న లోకేషన్‌కే వచ్చి గమ్యస్థానాలకు చేర్చుతున్నాయి. ఇందులో డెలివరీ బాయ్స్ కీలకపాత్ర పోషిస్తున్నారు.

కార్పొరేట్ కంపెనీల రాకతో..

అమెజాన్, ఫ్లిప్కార్ట్, జొమాటో, స్విగ్గీ, ఉబర్, రాపిడో, ఓలా, బిగ్ బాస్కెట్ లాంటి సంస్థల్లో పని చేసే కార్మికులు ప్లాట్‌ఫామ్ వర్కర్స్‌గా గుర్తింపు పొందారు. గిగ్-ఆధారిత పద్ధతిలో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్(మొబైల్ యాప్స్) ద్వారా పనిచేసే అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు గుర్తింపు కార్డులు పొందేలా కేంద్ర ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. తద్వారా పలు సంక్షేమ పథకాలకు వీరు అర్హులవుతారు. ఆహార, సరకు రవాణా, డెలివరీ రైడ్-షేరింగ్, కొరియర్ సేవలు అందించే వారు, డ్రైవర్లు, ప్లాట్‌ఫామ్ కార్మికులందరూ అసంఘటిత రంగ కార్మికులు పరిగణించబడతారు. ఇలాంటి వారు రాజమండ్రి, పరిసర ప్రాంతాల్లో రెండు వేల నుంచి మూడు వేల మంది వరకు ఉన్నారు. వీరు అవసరం మేరకు పనిచేయడం, లేకపోతే పనికి దూరంగా ఉండడం చేస్తుంటారు. ఆయా సంస్థలు కూడా వీరిని యాక్టివ్/ఇన్ యాక్టివ్ వర్కర్స్‌గా పరిగణిస్తుంటారు. ఈ క్రమంలో వీరు ఎంతమంది ఉన్నారనేది అధికారులు కచ్చితంగా గుర్తించలేకపోతున్నారు. ఇలా అసంఘటితంగా పనిచేసే వీరంతా ఈ-శ్రమ్‌లో ఉచితంగా నమోదు చేసుకోవడానికి అర్హులే. అసంఘటిత రంగంలో పనిచేసే వీరు కొన్ని సంక్షేమ ప్రయోజనాలు పొందడానికి ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ వివరాలు అప్‌లోడ్ చేయాలి.

నేరుగా నమోదు కుదరదు

డెలివరీ బాయ్స్ కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లో నేరుగా నమోదు సాధ్యం కాదు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో ప్లాట్‌ఫామ్ వర్కర్స్ అనే లింక్ ఉంటుంది. అది ఓపెన్ చేసి, వారి వివరాలను నమోదు చేస్తేనే వీరికి వర్తిస్తుంది. వారికి నమోదు చేసుకోవడం తెలియకపోతే వార్డు, గ్రామ సచివాలయాలు, కార్మిక శాఖ కార్యాలయాల్లో ఉచితంగా నమోదు చేస్తున్నారు. వయస్సు 16 నుంచి 59 ఏళ్ల మధ్య ఉండాలి. ఆదాయపు పన్ను పరిధిలో లేని వారై ఉండాలి. ఆయుష్మాన్ భారత్-పీఎం జన్ ఆరోగ్య యోజన కింద రూ.5.లక్షల వార్షిక ఆరోగ్య కవరేజ్ ఉంటుంది.

17 వరకు ప్రత్యేక డ్రైవ్

రాష్ట్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ వరకు ప్రత్యేక ప్రచార, అవగాహన, నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా నగరవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శిబిరాల నిర్వహణ, ప్లాట్‌ఫామ్ కార్మికుల హక్కులపై అవగాహన కల్పిస్తారు.
– టీఎంఎస్ వలీ, సహాయ కార్మిక కమిషనర్, రాజమండ్రి



భద్రత కల్పించడం హర్షణీయం

డెలివరీ బాయ్స్‌ను చులకనగా చూస్తున్నారు. కొంత మంది అయితే లేట్టైతే కాన్సిల్ చేయడం లేదా రేటింగ్ తగ్గించడం చేస్తున్నారు. కొన్ని సార్లు తిట్టిన సందర్భాలున్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వం మా కోసం ఆరోగ్య భద్రత కల్పించడం, ఈ-శ్రమ్ కార్డులు అందించడం హర్షణీయం.
– కె.కిరణ్‌కుమార్, డెలివరీ బాయ్

రోప్ స్కిప్పింగ్‌లో 'ఎస్‌కేఆర్' విశేష ప్రతిభ

అంతర కళాశాలల ఆల్‌రౌండ్ చాపియన్‌షిప్ కైవసం



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాఘవకుమారి

సీటీఆర్ఐ: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఇంటర్ కాలేజ్ చాంపియన్‌షిప్ ఫర్ వుమెన్ రోప్ స్కిప్పింగ్ టీం సెలక్షన్ కం పోటీల్లో స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన క్రీడాకారులు ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్ గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థినుల అంకితభావం, పట్టుదల అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అద్భుత నైపుణ్యంతో రాణించిన క్రీడాకారులు ఎ.యామినీదేవి, ఎం.నాగదేవి, ఎస్.రూప గంగాభవాని రాజస్థాన్‌లో జరిగే ఆలిండియా రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వై.సుధారాణి, ఎ.నాగు మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో కూడా వీరు సత్తా చాటుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ కేఎస్ రత్నకుమార్, అధ్యాపక బృందం, సిబ్బంది క్రీడాకారులను అభినందించారు.

రోడ్ కమ్ రైలు వంతెన మార్గాన్ని తీర్చిదిద్దాలి

కార్పొరేషన్ కమిషనర్ కేతన్‌గార్గ్



రోడ్ కమ్ రైలు బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: భవిష్యత్తులో వాహనాల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున రోడ్ కమ్ రైలు వంతెనకు వెళ్లే మార్గాన్ని ఎన్టీఆర్ విగ్రహం నుంచి ధార్వాడ అపార్ట్‌మెంట్ వరకు తీర్చిదిద్దాలని కార్పొరేషన్ కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. నగర ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికా, ఆరోగ్య విభాగం అధికారులతో కలిసి కమిషనర్ బుధవారం రోడ్ కమ్ రైలు వంతెనకు వెళ్లే రహదారిని పరిశీలించారు. రహదారిని అభివృద్ధి చేసే విషయమై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగులకు విస్తరించాల్సి ఉన్నందున, ఆ మేరకు అవసరమైన వారికి వారంలో ఇవ్వటానికి టీడీఆర్‌లు సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్డు, ఫుట్‌పాత్‌ను తిరిగి నిర్మించాలని, ఆక్రమణలను తక్షణం తొలగించాలన్నారు. రోడ్డును ఆనుకుని ఉన్న వీధులకు సక్రమంగా అప్రోచ్ రోడ్లను నిర్మించాలని ఆదేశించారు. డ్రైన్లలో వ్యర్థాలను తొలగించాలని, రోడ్డును శుభ్రంగా ఉంచాలన్నారు. ఆయన వెంట సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, మున్సిపల్ ఆరోగ్యాధికారిని డా. ఎ.వినూత్న, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మాధవి, సెక్రటరీ శైలజావల్లి, డీఈఈ సత్యనారాయణ, శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్ ఉన్నారు.

విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

ఎఫ్‌డీఓ బ్రహ్మానందం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ బ్రహ్మానందం

రాజమహేంద్రవరం రూరల్: ప్రజలంతా విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండేలా అధికారులు అవగాహన కల్పించాలని రాజమండ్రి ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, మాస్టర్ ట్రైనర్ ఎం.బ్రహ్మానందం అన్నారు. బుధవారం హుకుంపేటలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రూరల్ తహసీల్దార్ పీవీవీజే సూర్యకుమార్ అధ్యక్షతన డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ బ్రహ్మానందం మాట్లాడుతూ, తుపాన్లు, వరదలు, గాడ్పులు, భూకంపం తదితర ప్రకృతి విపత్తులు సంభవించే సమయంలో ముందు, వచ్చినప్పుడు, అనంతర చర్యలపై అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన అధికారులు తమ పరిధిలో అధికారులతో పాటు, సిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, సహాయ అగ్నిమాపకాధికారి శ్రీనివాస్, విద్యుత్, వ్యవసాయ, పశు సంవర్థక, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రామాయణ దృశ్య కావ్యం



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

రాజమహేంద్రవరం సిటీ: శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా స్థానిక సీతంపేట రామాలయంలో బుధవారం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులకు కనువిందు చేసింది. స్వప్నశ్రీ కళా నిలయం నాట్యాచారిణి కొప్పినీడి స్వప్నసతీష్ శిష్య బృందం ఈ నృత్య ప్రదర్శన చేశారు. ముందుగా గణపతి స్తోత్రాన్ని నృత్య రూపంలో ప్రదర్శించారు. అనంతరం శ్రీరామచంద్రుని స్తుతిస్తూ, అదిగో భద్రాద్రి, దశరథ రామా గోవిందా వంటి గీతాలకు చిన్నారులు తమ అభినయాన్ని కళారూపంలో చూపించారు.

పెట్రో ఉత్పత్తుల ధరలు తగ్గించాలి



శ్యామలా సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరతో పాటు, పెట్రో ఉత్పత్తుల ధరలు తక్షణమే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్త ఆందోళనలో భాగంగా స్థానిక శ్యామలాసెంటర్‌లో ఖాళీ సిలిండర్‌తో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ, గ్యాస్ సిలిండర్‌తో పాటు, అన్ని రకాలా ధరలు పెంచి ప్రజల నెత్తిన భారం మోపడమే సీఎం చంద్రబాబు పీ-4 ఉద్దేశమని, ఇటువంటి చర్యలకు వ్యతిరేకంగా సీపీఎం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, ఇతర భారాలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పూర్తి బాధ్యత వహించి, ధరలు తగ్గించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినా, దేశంలో ఇంకా పెంచడం దారుణమన్నారు. అమెరికా అధ్యక్షుడి సుంకం విధానాల వలన రాష్ట్రంలో ఆక్వా పరిశ్రమలు మూతపడే ప్రమాదం ఏర్పడిందని, దీనివల్ల అనేక కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం పెంచిన ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేసి, పెట్రోలు, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఐ.సుబ్రహ్మణ్యం, బి.పూర్ణిమరాజు, నగర కమిటీ నాయకులు వి.రాంబాబు, భాస్కర్, అశోక్, రాజేష్, జ్యోతి, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్వరరావు జీవితం ఆదర్శప్రాయం

సీపీఐ జిల్లా కార్యదర్శి మధు



రాజేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, భూ పోరాట యోధుడు, ఆదర్శ కమ్యూనిస్టు నేత చండ్ర రాజేశ్వరరావు జీవితాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో చండ్ర రాజేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం పార్టీ నగర కార్యదర్శి వి.కొండలరావు అధ్యక్షతన నిర్వహించారు. ప్రపంచ స్థాయి నేతగా రాజేశ్వరరావు ఎదిగారని, దేశ స్వాతంత్ర్యం కోసం వివిధ దశల్లో జరిగిన ప్రజా ఉద్యమాలకు ఆయన నాయకత్వం వహించారని గుర్తు చేశారు. చల్లపల్లి జమీందార్ ఆక్రమణలో ఉన్న వేలాది ఎకరాలను పోరాటాలు చేసి పేదలైన వ్యవసాయ కార్మికులకు పంపిణీ చేశారన్నారు. పేదరికం తగ్గాలంటే భూమి సమస్య పరిష్కారం కావాలని, పేదలకు భూములు దక్కాలని బలంగా నమ్మేవారిని కొనియాడారు. కమ్యూనిస్ట్ పార్టీ ప్రజా సంఘాల నిర్మాణానికి విలువైన సూత్రాలను ఆయన అందించారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, పార్టీ పటిష్ఠ నిర్మాణమే ఆయనకు నిజమైన నివాళి అని చెప్పారు.

విద్యార్థులకు 'స్వర్ణాంధ్ర' ఆర్థిక సాయం



విద్యార్థులకు స్కూలు ఫీజును అందజేస్తున్న గుబ్బల రాంబాబు, రామకోటేశ్వరరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఆ కుటుంబాన్ని కష్టాలు కమ్మేశాయి. తండ్రి అనారోగ్యం కారణంగా ఇల్లు గడవడమే కష్టంగా మారింది. దీంతో పిల్లల చదువుకు ఫీజు చెల్లించలేని దుస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ విషయం స్వర్ణాంధ్ర సేవా సంస్థ దృష్టికి వచ్చింది. ఆ పిల్లల చదువుకు ఫీజు కట్టేందుకు ముందుకు వచ్చారు స్వర్ణాంధ్ర నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు. తొర్రేడు గ్రామంలో ఉన్న లాసాలెట్ విద్యాలయంలో ఐదో తరగతి చదువుతున్న రాయుడు ధర్మతేజ, ఎనిమిదో తరగతి చదువుతున్న భువనశ్రీకి ఫీజు కోసం స్వర్ణాంధ్ర సభ్యుల నుంచి సేకరించిన రూ.14 వేలకు స్వర్ణాంధ్ర రాంబాబు సమకూర్చిన రూ.ఏడు వేలను కలిపి రూ.21 వేలు ఫీజును స్కూలు యాజమాన్యానికి బుధవారం ఉదయం చెల్లించారు. ఈ సందర్భంగా జిల్లా విశ్రాంత పశు సంవర్థక శాఖ అధికారి మాటూరి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర సేవా సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. నిరంతర సామాజిక సేవలు చేస్తున్న స్వర్ణాంధ్ర రాంబాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జిమ్, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, విశ్రాంత ఉద్యోగి డి.సుబ్రహ్మణ్యం, హరిప్రసాద్, ఆర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని అమ్మమ్మ ఇంటికి వచ్చిన తన 16 ఏళ్ల కుమార్తె కనిపించడం లేదని గొల్లప్రోలుకు చెందిన వరలక్ష్మి బుధవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు, గొల్లప్రోలుకు చెందిన బాలిక ఈ నెల 4న బొమ్మూరు నేతాజీనగర్‌లో అమ్మమ్మ ఇంటికి వచ్చింది. ఈ నెల 8న గొల్లప్రోలుకు వెళుతున్నానని అమ్మమ్మకి చెప్పి బయలుదేరింది. తన కుమార్తె ఇప్పటివరకు ఇంటికి చేరలేదని వరలక్ష్మి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్పత్తులకు తగ్గట్టుగా ప్యాకింగ్ ఉండాలి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న నటరాజ్

రాజానగరం: మార్కెట్‌లో ఉత్పత్తులకు తగ్గట్టుగా ప్యాకింగ్ ఉండాలని, అప్పుడే వినియోగదారులను ఆకట్టుకోగలుగుతారని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకింగ్ (హైదరాబాద్) డిప్యూటీ డైరెక్టర్ ఎస్.నటరాజ్ అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో బీటెక్ (అగ్రికల్చర్), గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులకు ప్యాకింగ్ ఫర్ మెడికల్ డివైసెస్ అనే అంశంపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఏ ఉత్పత్తి అయినా ప్యాకింగ్ లేకుండా మార్కెట్‌లోకి రాదన్నారు. తయారీదారుకు, వినియోగదారుకు ప్యాకింగ్ ఓ వారధి వంటిదన్నారు. కరోనా వైరస్ విజృంభణ సమయంలో పనిచేసిన మూడు రంగాలకు చెందిన పరిశ్రమలలో ప్యాకింగ్ కీలకమైందన్నారు. ప్యాకింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రొ. వీసీ డాక్టర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రన్, బీటెక్ (అగ్రికల్చర్) హెచ్‌ఓడీ బి.బలరామ్ భగత్, డైరెక్టర్లు డాక్టర్ ఆర్ఎస్ రాజు, డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద ఘంటికలు

- మితిమీరిన భారీ వాహనాల జోరు
- బెంబేలెత్తుతున్న వివిధ గ్రామాల ప్రజలు
- రాత్రి వేళల్లోనూ సాగుతున్న రాకపోకలు
- నిబంధనలకు విరుద్ధంగా ట్రిప్పులు



కోరుకొండలో రాత్రి వేళ భారీ వాహనాల జోరు

కోరుకొండ: మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలోని ప్రకృతి వనరులు దోపిడీ యథేచ్ఛగా సాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో భారీ వాహనాల రాకపోకలు అనేక గ్రామాల్లో ఆందోళనకరంగా మారాయి. పది నుంచి ఇరవై చక్రాల వరకూ భారీ వాహనాలు అపరిమిత వేగంతో దూసుకుపోతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రోడ్లపై ప్రయాణించాలంటేనే బెంబేలెత్తుతున్నారు. మండల కేంద్రమైన కోరుకొండతో పాటు, 24 గ్రామాల్లోనూ భయానక వాతావరణం నెలకొంది. ఉద్యోగాల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లేవారు, పొలాలు, తోటలకు వెళ్లే రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, మహిళలు ఇలా ఆయా రహదార్లలో ప్రయాణించే వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రకృతి సంపదైన మట్టి, ఇసుక, గ్రావెల్, నల్లరాయి వంటి వాటిని ఇష్టారాజ్యంగా రవాణా చేసేందుకు రేయింబవళ్లు భారీ వాహనాలను వినియోగించడం ఆయా ప్రాంతాల్లో ప్రధాన సమస్యగా మారింది.

అపరిమిత వేగంతో..

భారీ వాహనాల ద్వారా మట్టి, ఇసుక, కంకర రవాణా జరుగుతోంది. తొందరగా గమ్యాలకు చేరుకోవాలన్న ఆతృతతో డ్రైవర్లు అపరిమిత వేగంతో లారీలను నడుపుతున్నారు. దీంతో గ్రామాల్లో నిత్యం ప్రమాదకర పరిస్థితులు పొంచి ఉన్నాయి. ఎక్కువ ట్రిప్పులు వేయాలన్న ఆలోచన మినహా.. రోడ్లపై ప్రజలు ఏమవుతారన్న కనీస దృష్టి డ్రైవర్లకు ఉండడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ క్రమంలో ఏదైనా ప్రమాదం చోటుచేసుకుంటే బాధ్యులెవరని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు చోద్యం చూస్తున్నారు.

వందలాదిగా..

టన్నుల కొద్దీ సరకును తరలిస్తున్న 14, 20 చక్రాల లారీలు వందలాదిగా నడుస్తున్నాయి. ఒక్కో లారీలో 22, 25 టన్నుల సరకు లోడ్ అవుతోందంటున్నారు. నిబంధనల ప్రకారం 16-18 టన్నులు మాత్రమే లోడ్ చేయాలి. పరిమితికి మించి లోడ్ చేయడంతో ఎక్కడికక్కడ మట్టి, కంకర రోడ్లపైనే పడిపోతుంది. వెనుకగా వస్తున్న ద్విచక్ర వాహనదారుల కళ్లలో మట్టి, గ్రావెల్ పడడం సాధారణంగా మారింది. భారీ వాహనాల వారు కనీస జాగ్రత్తలు పాటించకపోవడం ఇతర ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారుతోంది.

ప్రయాణిస్తున్న మార్గాలివే..

మండలంలో శివారు ప్రాంతాలైన గరగలంపాలెం, బొల్లెద్దుపాలెం, కోటికేశవరం, రాఘవపురం నుంచి భవన నిర్మాణాలకు ఉపయోగించే కంకర రవాణా జరుగుతోంది. అలాగే మండల సరిహద్దునున్న ఏజెన్సీ ప్రాంతంలోని క్వారీల నుంచి గ్రావెల్ కోరుకొండ మీదుగా రవాణా జరుగుతోంది. ఈ రోడ్డుకు అనేక గ్రామాలు అనుసంధానంగా ఉన్నాయి. భారీ వాహనాలు సరకుతో తెల్లవారుజాము నుంచి రాత్రివేళ్లల్లోనూ ప్రయాణిస్తున్నాయి. అలాగే రాఘవపురం, గాదరాడ, నర్సాపురం గ్రామాల వైపు నుంచి మట్టి రవాణా జరుగుతోంది. సంబంధిత అధికారులు ఈ భారీ వాహనాలను నియంత్రించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రక్షణ కల్పించాలి

భారీ వాహనాలను ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. యథేచ్ఛగా మట్టి, గ్రావెల్, కంకర అక్రమంగా రవాణా చేస్తున్నారు. నిబంధనలకు నీళ్లొదిలి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. భారీ వాహనాలను రాత్రి వేళల్లోనే అనుమతించాలి. భారీ వాహనాల నుంచి స్థానికులకు రక్షణ కల్పించాలి. వాహనాలను వేగంగా నడపరాదు. ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి.
– మారిశెట్టి తేజోనాయుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్, కోరుకొండ

పరిమితికి మించి అనుమతించరాదు

మట్టి, గ్రావెల్, కంకర, నల్లరాయి, ఇసుక రవాణాలో పరిమితులను పరిగణనలోకి తీసుకోవడం లేదు. రాత్రి వేళల్లో నిర్వహించడానికి వాటికి అనుమతులు లేవు. అయినప్పటికీ నిర్వాహకులు నిబంధనలను పాటించడం లేదు. అధికారులు కనీసం పట్టించుకోకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.
– పసుపులేటి బుల్లియ్యనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు